క్లుప్తంగా

గృహ నిర్మాణాలు పరిశీలన

నింద్ర: మండలంలో గృహనిర్మాణ పనులు, మండల కేంద్రంలోని ఎన్టీఆర్ గృహ నిర్మాణాలను హౌసింగ్ శ్రీధర్‌రాజు శనివారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్మాణ పనులు వేగవంతం చేయాలని అన్నారు. పూర్తి చేసిన వారికి బిల్లులు సకాలంలో అందిస్తామన్నారు. పనులు పూర్తి కాని వారితో చర్చించి మాట్లాడి పూర్తి చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు పాల్గొన్నారు.

కటి, అభయ హస్తాల బహూకరణ


కటి, అభయ హస్తాలను అందజేస్తున్న దాతలు

వడమాలపేట (పుత్తూరు): అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామికి తిరుపతికి చెందిన లావణ్య, మోహన్ దంపతులు శనివారం శ్రీవారికి వెండితో తయారు చేసిన 1.624 కేజీల బరువైన కటి, అభయ హస్తాలను బంగారు తాపడం చేసి, బహూకరించారు. వీటి విలువ రూ.3.5 లక్షలుగా దాతలు తెలిపారు. వీరికి ఆలయ అధికారులు స్వామివారి దర్శన ఏర్పాట్లు చేసి, తీర్థప్రసాదాలు అందజేశారు.

పుత్తూరు కళాశాలలో స్వచ్ఛాంధ్ర


సైకిల్ ర్యాలీ

పుత్తూరు: ఎస్ఆర్ఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ప్రిన్సిపల్ చంద్రమౌళి మాట్లాడుతూ క్లీన్ ఎయిర్‌పై అవాహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. సౌర విద్యుత్, విద్యుత్ వాహనాల వినియోగంపై అవగాహన కల్పించారు. అనంతరం కళాశాలలో మొక్కలు నాటడం, వ్యాసరచన పోటీలు నిర్వహించారు. విద్యార్థులు సైకిల్ ర్యాలీ నిర్వహించారు.

నగరిలో..



నగరి: ఆంధ్రప్రదేశ్‌ను పరిశుభ్ర రాష్ట్రంగా తీర్చిదిద్దడంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని మున్సిపల్ కమిషనర్ కె.వి.కృష్ణారెడ్డి పిలుపునిచ్చారు. శనివారం స్వర్ణాంధ్ర–స్వచ్ఛాంధ్ర కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. నగరి సంత మైదానంలో ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టారు. మున్సిపల్, మెప్మా, సచివాలయాల సిబ్బందితో కలిసి పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో పురుషోత్తం, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో..

నగరి కళాశాలలో మొక్కలు నాటడం, వ్యాసరచన పోటీలు, సైకిల్ ర్యాలీ నిర్వహించారు. కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపల్ డాక్టర్ భాస్కర్‌రాజు, అధ్యాపకులు సుహాసిని, శ్రీలక్ష్మీ, స్వాతి, ఉమామహేశ్వరి, కుమారి, కిరణ్, లాల్‌బాషా, విద్యార్థులు పాల్గొన్నారు.

బ్రహ్మలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు



నింద్ర: మండలంలోని ఎలకాటూరు గ్రామంలో ఉన్న పురాతన శ్రీకామాక్షి సమేత బ్రహ్మలింగేశ్వర స్వామివారి ఆలయంలో శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం గ్రామస్తులు స్వామివారికి ప్రత్యేక అభిషేకాలు, అర్చనలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

భానూ.. బహిరంగ చర్చకు సిద్ధమా!


మాట్లాడుతున్న మాజీ మంత్రి ఆర్కే రోజా


సమావేశానికి హాజరైన వైఎస్ఆర్ సీపీ శ్రేణులు

- కలెక్షన్లపై ఉన్న శ్రద్ధ అభివృద్ధిపై లేదు
- చేసిన అభివృద్ధిపై బహిరంగ చర్చకు రావాలి
- అంబేద్కర్ సర్కిల్ వద్ద కూర్చుందామా?
- ఎమ్మెల్యే భానుప్రకాష్‌కు మాజీ మంత్రి ఆర్కే రోజా సవాల్

పుత్తూరు: తిరుపతిలో కూర్చొని కలెక్షన్లు చేసుకొనే భానుప్రకాష్ నగరికి ఎమ్మెల్యేనా తిరుపతికా అంటూ మాజీ మంత్రి ఆర్కే రోజా ప్రశ్నించారు. శనివారం స్థానిక ఏడీకే కల్యాణ మండపంలో మెడికల్ కళాశాలల ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా నిర్వహించిన వైఎస్ఆర్ సీపీ కోటి సంతకాల ప్రజా ఉద్యమం కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా నగరి ఎమ్మెల్యే గాలి భానుప్రకాష్‌పై నిప్పులు చెరిగారు. గత వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వంలో రెండేళ్లు కరోనాతో ఆర్థికంగా ఎన్ని ఇబ్బందులు ఉన్నా నగరి నియోజకవర్గం మొత్తం మీద చెప్పుకో దగ్గ శాశ్వత అభివృద్ధి పనులు చేశామని తెలిపారు. ఈవీఎంలతో దొంగచాటున ఎమ్మెల్యే అయిన భాను తిరుపతిలోనే ఉంటున్నారని విమర్శించారు. తిరుపతికే అధికారులను, నాయకులను పిలిపించుకొని మాట్లాడే వ్యక్తి నగరికి ఎలా ఎమ్మెల్యే అవుతాడంటూ ప్రశ్నించారు. మైన్స్‌లో ఎంత కలెక్షన్ వచ్చిందీ.. ఇసుకలో ఎంత? మట్టిలో ఎంత?, మందులో ఎంత?, ఎన్‌హెచ్ రోడ్లలో ఎంత? అంటూ కలెక్షన్ చూసుకోవడం తప్ప.. ఒక్క అభివృద్ధి పనైనా చేశారా అంటూ నిలదీశారు. ఆయన, ఆయన తండ్రీ చేసిన అభివృద్ధిపైనా, తాను చేసిన అభివృద్ధిపైనా బహిరంగ చర్చకు సిద్ధమా? పుత్తూరు అంబేద్కర్ సర్కిల్ వద్ద కూర్చుందామా? అంటూ హర్షధ్వనుల మధ్య సవాల్ చేశారు.

తోపులు.. తురుములు అనే వారు వీటికి సమాధానం చెప్పండి అంటూ ప్రశ్నల వర్షం కురిపించారు.. అందులో మచ్చుకు కొన్ని..

- పుత్తూరును మున్సిపాలిటీని చేసిన ఆయన తండ్రి ముద్దుకృష్ణయనాయుడు ఇక్కడ పార్కు ఎందుకు ఏర్పాటు చేయలేకపోయారు?
- ఎందుకు పాలిటెక్నిక్ కళాశాల కట్టలేకపోయారు?
- ఎందుకు షాదీమహల్ కట్టలేకపోయారు?
- ఎందుకు మున్సిపల్ భవనం కట్టలేకపోయారు?
- ఎందుకు ఎలక్ట్రికల్ క్రిమేషన్ షెడ్ కట్టలేకపోయారు?
- ఎందుకు నాలుగు అర్బన్ హెల్త్ సెంటర్లు కట్టించలేకపోయారు?
- నగరిలో ఎందుకు డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయలేదు?
- వడమాలపేట, నగరి బుగ్గ అగ్రహారం, నింద్ర, విజయపురంలోని పీహెచ్‌సీలను ఎందుకు ఆధునికీకరించలేక పోయారు?
- పుత్తూరులో మాజీ ఎంపీపీ ఉన్నాడు.. ఆయనే ఎమ్మెల్యేలా ఫీలైపోతుంటాడు, ఆయన ఊర్లోని పీహెచ్‌సీని తాము కట్టిన సచివాలయంలో ఎందుకు నిర్వహిస్తున్నారని ప్రశ్నలు సంధించారు. వీటన్నింటికీ ఈవీఎంలతో దొంగచాటుగా ఎమ్మెల్యే అయిన వ్యక్తి సమాధానం చెప్పాలని సవాల్ చేశారు.

జింక్ లోపాన్ని గుర్తించండి

నింద్ర: వరి పంట సాగు చేసే రైతులు తమ పొలంలో జింక్ లోపాన్ని గుర్తించి చర్యలు తీసుకోవాలని మండల వ్యవసాయాధికారి తులసీరాం తెలిపారు. శనివారం మండలంలోని అగరం, చవరంబాకం గ్రామాల్లో వరి పొలాలను ఆయన పరిశీలించారు. వరి నాట్లు వేసిన పొలాల్లో జింక్ లోపం ఉంటే గుర్తించి, తగు చర్యలు తీసుకోవాలని అన్నారు.

ఘనంగా శనిత్రయోదశి పూజలు



వెదురుకుప్పం: మండలంలోని డీఆర్ఎస్ కండ్రిగ సమీపంలోని అరుణగిరిపై ఉన్న శ్రీజ్ఞాన ప్రసూనాంబ సమేత కొండమల్లీశ్వర స్వామి ఆలయంలో శనివారం శని త్రయోదశిని పురస్కరించుకుని విశేష పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వేకువ జామునే సుప్రభాత సేవతో స్వామివారిని మేల్కొలిపి ధూపదీప నైవేద్యాలు సమర్పించారు. తదుపరి ఆలయ ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో పాలాభిషేకం చేశారు. వెండి తొడుగులతో కూడిన ఆభరణాలు, పట్టుపీతాంబరాలతో స్వామి వారిని అలంకరించారు. భక్తి ప్రపత్తులతో పూజలు చేసి భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. సాయంత్రం శివునికి, నందీశ్వరునికి ఏకకాలంలో అభిషేకించి పూజలు చేశారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని, స్వామి వారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.

మహిళలపై వివక్ష తగదు


మాట్లాడుతున్న కృపాలక్ష్మి

కార్వేటినగరం: టీడీపీ మంత్రులు, ఎమ్మెల్యేలు, నాయకులకు మహిళలంటే ఎందుకు ఇంత వివక్ష అని వైఎస్ఆర్ సీపీ గంగాధరనెల్లూరు నియోజవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి ప్రశ్నించారు. పుత్తూరులోని ఆమె నివాసంలో విలేకరులతో మాట్లాడారు. తమ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఆదేశాలతో కల్తీ లిక్కర్ అరికట్టడంపై నాయకులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళలతో కలసి కార్వేటినగరం ఎక్సైజ్ కార్యాలయంలో వినతిపత్రం అందించామన్నారు. దీనిపై గంగాదరనెల్లూరు ఎమ్మెల్యే థామస్ ఇటీవల బహిరంగ సమావేశంలో దళిత మహిళ అయిన తనను అసభ్యకరమైన పదజాలంతో హేళనగా మాట్లాడడం అమానుషమన్నారు. ఆ వ్యాఖ్యలపై ఆమె కన్నీరుమున్నీర య్యారు. తాను ఏ తప్పు చేయకపోయినా టీడీపీ ఎమ్మెల్యే, నాయకులు, కార్యకర్తలు దారుణంగా మాట్లాడుతున్నారని, కొన్ని ప్రాంతాల్లో తన దిష్టిబొమ్మలను సైతం దహనం చేయడం అమానుషమన్నారు. ఈ విషయంపై జాతీయ ఎస్సీ మహిళ, ఎస్సీ, ఎస్టీ కమిషన్‌కు ఫిర్యాదు చేశామన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకి చిత్తశుద్ధి ఉంటే వెంటనే ఎమ్మెల్యే థామస్‌పై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. తనకు న్యాయం జరిగేంత న్యాయస్థానంలో పోరాటం చేస్తామన్నారు.

నటుడు ఏకాంబరానికి ఘన సన్మానం


ఏకాంబరంను అభినందిస్తున్న కృపాలక్ష్మి

శ్రీరంగరాజపురం: కాంతార చాప్టర్–1 సినిమాలో పాదలపల్లి గ్రామానికి చెందిన సర్పంచ్ భర్త ఏకాంబరం ఉత్తమ క్యారెక్టర్ విలన్‌గా నటించారు. అవార్డును కూడా పొందారు. దీంతో ఆ గ్రామంలో సన్మాన సభను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా వైఎస్ఆర్ సీపీ గంగాధర నెల్లూరు నియోజవర్గం సమన్వయకర్త కృపాలక్ష్మి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఉత్తమ క్యారెక్టర్ విలన్‌గా అవార్డుకు ఎంపికైన ఏకాంబరంను అభినందించారు. గ్రామస్తులంతా బాణసంచా పేలుళ్ల నడుమ ఏకాంబరంను అభినందించారు. అనంతరం ఏకాంబరం మనవడు తేజస్ పుట్టినరోజు వేడుకల్లో చిన్నారిని కృపాలక్ష్మి ఆశీర్వదించారు. చిన్నారికి పలు బహుమతులను అందించారు. ఉమ్మడి జిల్లా ఉపాధ్యక్షుడు గురవారెడ్డి, మండల కన్వీనర్ మణి, ఎంపీపీ సరిత జనార్దన్, రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి కాలప్ప, నాయకులు మహేష్, జయ, రఘు, సుధాకర్, చిట్టిబాబు, కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


విద్యార్థుల మానవహారం

వెదురుకుప్పం: పర్యావరణ పరిరక్షణకు యువత కృషి చేయాలని ప్రిన్సిపల్ అన్నపూర్ణశారద అన్నారు. శనివారం మండలంలోని చవటగుంట డాక్టర్ వైఎస్ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వ ర్యంలో పర్యావరణ పరిరక్షణపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ అన్నపూర్ణ శారద మాట్లాడుతూ మానవ మనుగడకు స్వచ్ఛమైన గాలి అవసరమన్నారు. అదేవిధంగా పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ద్వారా వివిధ రకాల కాలుష్యాలను నియంత్రించవచ్చన్నా రు. కాలుష్య నియంత్రణకు ప్రధానంగా మొక్కలు పెంచడమే కాకుండా ప్లాస్టిక్ వాడకాన్ని అరికట్టాల న్నారు. రోజు రోజుకీ పెరుగుతున్న కాలుష్యం కారణంగా మానవ మనుగడ ప్రమాదంలో పడుతున్న ట్లు ఆందోళన వ్యక్తం చేశారు. ఆరోగ్యవంతమైన సమాజానికి పర్యావరణాన్ని పెంచడమే ముఖ్య మని చెప్పారు. గాలి కాలుష్యానికి కారణాలు, వాటి దుష్ప్రభావాలపై విద్యార్థులకు తెలియజేశారు. అనంతరం కళాశాల ఆవరణలో మొక్కలు నాటారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పార్టీల ఏజెంట్లను నియమించుకోండి


మాట్లాడుతున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్

గంగాధరనెల్లూరు: ప్రతి ఒక పోలింగ్ బూత్‌కి అన్ని రాజకీయ పార్టీల నుంచి ఏజెంట్లను పెట్టుకోవాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ పిలుపునిచ్చారు. శనివారం తహశీల్దార్ కార్యాలయంలో రాజకీయ పార్టీలకు చెందిన నేతలు, అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ వెంకటశివ మాట్లాడుతూ రాజకీయ పార్టీలు పెట్టుకునే ఏజెంట్ల వివరాలను అధికారులకు అందజేయాలని కోరారు. పోలింగ్ కేంద్రాల నిర్వహణలో ఏదైనా సమస్యలు ఉంటే తెలియజేయాలని కోరారు. తహశీల్దార్‌లు శ్రీనివాసులు, లోకనాథంపిళ్లై, ఎన్నికల డీటీ మహేశ్వరి, వివిధ పార్టీల నేతలు, నారాయణరెడ్డి, వెంకటేష్ రెడ్డి, సుధాకర్, గోవర్ధన్‌రెడ్డి, లోకేష్, శివకుమార్, ఉదయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్డును బాగు చేయండి


ఆటోలో వెళ్లేందుకు ఇబ్బందులు పడుతున్న గ్రామస్తులు


నీళ్లల్లో నిలబడి నిరసన వ్యక్తం చేస్తున్న యువత

వెదురుకుప్పం: మారుమూల ప్రాంతమైన కురివికుప్పం దళితవాడకు ముప్పయ్యేళ్లుగా రోడ్డు సక్రమంగా లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, రోడ్డును బాగు చేయాలని ఆ గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. రోడ్డుపై నిలిచిన వర్షపు నీటిలో నిలబడి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడారు. గ్రామం నుంచి సుదూర ప్రాంతాలైన తిరుపతి, చిత్తూరు ప్రాంతాలకు వెళ్లాలంటే రవాణా సౌకర్యం సక్రమంగా లేని కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. అత్యవసర పరిస్థితుల్లో ఆసుపత్రులకు వెళ్లాలంటే నరకయాతన పడుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామం నుంచి పాఠశాలలు, కళాశాలలకు వెళ్లి రావాలంటే విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారని తల్లిదండ్రులు తెలిపారు. బస్సులు వచ్చే పరిస్థితి లేకపోయినా కనీసం ఆటోలో వెళ్లాలన్నా ప్రాణ సంకటంగా ప్రయాణం మారిందని చెబుతున్నారు. వర్షం వస్తే రోడ్డు పై అడుగు తీసి అడుగు పెట్టలేకపోతున్నామంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రోడ్డును బాగు చేసి, బస్సు సౌకర్యం కల్పించాలని కోరుతున్నారు.

వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుంది



రమణకు నివాళులర్పిస్తున్న మాజీ మంత్రి ఆర్కే రోజా, దావూద్‌కు పరామర్శ

పుత్తూరు: ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు వైఎస్ఆర్ సీపీ అండగా ఉంటుందని మాజీ మంత్రి ఆర్కే రోజా భరోసా ఇచ్చారు. పుత్తూరు మున్సిపాలిటీ 2వ వార్డు వైఎస్ఆర్ సీపీ నాయకుడు పి.వి.రమణ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందారు. శనివారం ఆయన ఇంటికెళ్లిన రోజా మృతుడి చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి ధైర్యం చెప్పారు. 13వ వార్డు ఎన్టీఆర్ కాలనీకి చెందిన యువ నాయకుడు దావూద్ తండ్రి మొహమద్‌అలీ ఇటీవల ఆకస్మికంగా మరణించాడు. ఆయన నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

కృపాలక్ష్మిపై ఎమ్మెల్యే వ్యాఖ్యలు సరికాదు


నకిలీ మద్యం, ఎమ్మెల్యే థామస్‌కు వ్యతిరేకంగా వైఎస్ఆర్ సీపీ శ్రేణుల నిరసన

పాలసముద్రం: నకిలీ మద్యం తయారీపై గళమెత్తిన గంగాధరనెల్లూరు వైఎస్ఆర్ సీపీ సమన్వయకర్త కృపాలక్ష్మిపై ఎమ్మెల్యే థామస్ చేసిన వ్యాఖ్యలను ఖండిస్తూ శనివారం తిరుమలరాజుపురం రైస్‌మిల్ వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు. వైఎస్ఆర్ సీపీ నాయకులు మాట్లాడుతూ టీడీపీ ఎమ్మెల్యే థామస్ చేసిన వ్యాఖ్యలను రాష్ట్ర మహిళ సంఘాలు ఛీకొడుతున్నా టీడీపీ నాయకులు ఎమ్మెల్యే ప్రోద్బలంతో దిష్టిబొమ్మను కాల్చడం దారుణమని ధ్వజమెత్తారు. నకిలీ మద్యం కేసులో ప్రధాన నిందితులంతా ప్రభుత్వ పెద్దల వాటాదారులు కావడంతో మొక్కు బడిగా కేసులు నమోదు చేశారని విమర్శించారు. 16 నెలలుగా నకిలీ మద్యం తయారవుతుంటే ఈ ప్రభుత్వం ఏంచేస్తుందని నిలదీశారు. కూటమి ప్రభుత్వంలో గ్రామాల్లో నకిలీ మద్యం తయారీ ఒక కుటీర పరిశ్రమగా తయారైందన్నారు. ఇప్పటికైన ఎమ్మెల్యే థామస్ నకిలీ మద్యాన్ని అరికట్టి, మహిళలపై చేస్తున్న వ్యక్తిగత విమర్శలు మానుకోవాలని డిమాండ్ చేశారు.

కిటకిటలాడిన కలికిరికొండ


అన్నదాన కార్యక్రమం

పెనుమూరు(కార్వేటినగరం): పెనుమూరు మండలంలోని కలికిరి కొండపై వెలసిన కలియుగ ప్రత్యక్ష దైవం శ్రీవెంకటేశ్వర స్వామి ఆలయంలో పెరటాసి మాసం చివరి శనివారం సందర్భంగా భక్తులు ఆలయంలో కిటకిటలాడారు. గోవింద నామస్మరణతో కలికిరి కొండ మార్మోగింది. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వెంకటేశ్వర స్వామి మూల, ఉత్సవ విగ్రహాలకు ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి ప్రత్యేక అలంకరణ ఆలయ అర్చకులు వాసుదేవా ఆచార్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా చుట్టుపక్కల నుండి వేలాదిమంది భక్తులు తమ మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక భజన కార్యక్రమాలు, కోలాట కార్యక్రమాలు, దీపార్చన నిర్వహించారు. చిత్తూరు కట్టమంచి గ్రామానికి చెందిన యువకులు, అదేవిధంగా చుట్టుపక్కల గ్రామస్తులు వందలాది మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

అడవి జంతువులను వేటాడే వ్యక్తి అరెస్టు


అడవి జంతువులను వేటాడే వ్యక్తి అరెస్టు చూపుతున్న అటవీ శాఖాధికారులు

కార్వేటినగరం: అడవి జంతువులను వేటాడుతూ చంపి, వాటి మాంసం విక్రయించే ఓ వ్యక్తిని శనివారం అటవీశాఖ అధికారి వెంకటసుబ్బయ్య అరెస్టు చేశారు. విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ వెదురుకుప్పం మండలం శికారికాలనీకి చెందిన శ్రీరామ్ కార్వేటినగరం మండలం దాసునత్తం గ్రామ సమీపంలో నాటు తుపాకులతో అడవి జంతువులను వేటాడి కాల్చి చంపి ఆ మాంసాన్ని విక్రయిస్తుండగా, కార్వేటినగరం అటవీశాఖ అధికారులు నాటు తుపాకులతో పాటు మాంసాన్ని, ద్విచక్ర వాహనాన్ని పట్టుకుని సీజ్ చేసి అతన్ని జైలుకు పంపినట్లు చెప్పారు. కార్యక్రమంలో ఎఫ్ఆర్‌ఓ వెంకటసుబ్బయ్య, డీఆర్‌ఓ ఆనంద రెడ్డి, ఎఫ్ఎస్‌ఓ లోకేష్, బీట్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సర్వసభ్య సమావేశంలో రాజకీయం

- మండల సమావేశంలో రాజకీయ ప్రసంగం
- నివ్వెరపోయిన అధికారులు, ప్రజాప్రతినిధులు
- వడమాలపేట జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి ప్రసంగంపై దుమారం
- ప్రేక్షకపాత్ర వహించిన ఇన్‌చార్జి ఎంపీడీఓ


జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి రాజకీయ ఉపన్యాసంతో విస్తుపోతున్న ప్రజాప్రతినిధులు

వడమాలపేట(పుత్తూరు): మండల కేంద్రమైన వడమాల పేట మరోసారి రాజకీయాలకు చర్చా వేదికగా నిలిచింది. వడమాలపేట మండల పరిషత్ అధ్యక్షురాలు విజయలక్ష్మీపై ఈ నెల 3వ తేదీన ఆర్డీఓకు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన నేపథ్యంలో శనివారం నిర్వహించ తలపెట్టిన సర్వసభ్య సమావేశం ప్రాధాన్యత సంతరించుకొంది. నాటకీయ పరిణామాల మధ్య ఉదయం 11.30 గంటలకు ఎంపీపీ విజయలక్ష్మీ అధ్యక్షతన సమావేశం ప్రారంభమైంది. సమావేశంలో జడ్పీటీసీ మురళీధర్‌రెడ్డి మైకు అందుకోవడంతోనే పరోక్షంగా మాజీ మంత్రి ఆర్కే రోజా, ఆమె కుటుంబ సభ్యులపై నిరాధారమైన అవినీతి ఆరోపణలు చేశారు. దీంతో ఒక్కసారిగా అధికారులు, ప్రజాప్రతినిధులు నివ్వెరపోయారు. మండలంలో జరుగుతున్న అభివృద్ధి పనులు, చేపట్టాల్సిన కార్యక్రమాలను ప్రస్తావించకుండా ఆయన మైకు అందుకోవడంతోటే రాజకీయోపన్యాసం మొదలెట్టారు. ఓపక్క మాజీ మంత్రి రోజాపై అవినీతి ఆరోపణలు చేస్తూనే మరోపక్క ప్రస్తుత ఎమ్మెల్యే భానుప్రకాష్, ఆయన తండ్రి గాలి ముద్దుకృష్ణమనాయుడుపై పొగడ్తల వర్షం కురిపించారు. దీనిని వింటున్న అధికారులు, ప్రజాప్రతినిధులు మండల సమావేశాన్ని రాజకీయ వేదికగా మార్చడంపై తలలు పట్టుకొన్నారు. వేదికపైనే ఉన్న ఇన్‌చార్జి ఎంపీడీఓ హరినాథ్‌బాబుతో పాటు ఇతర అధికారులు, ప్రజాప్రతినిధులు ప్రేక్షకపాత్ర వహించారు.

ఎంపీటీసీల క్యాంపు డ్రామా

వడమాలపేట మండల పరిషత్ అధ్యక్షురాలు విజయలక్ష్మీపై అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చిన నేపథ్యంలో శనివారం నిర్వహించ తలపెట్టిన సర్వసభ్య సమావేశం కోరం లేకుండా వాయిదా పడుతుందని అందరూ భావించారు. మొత్తం ఏడుగురు ఎంపీటీసీ సభ్యుల్లో ఆరుగురు ఎంపీపీపై ఈ నెల 3వ తేదీన తిరుపతి ఆర్డీఓకు అవిశ్వాస తీర్మానం నోటీసు ఇచ్చారు. ఈ మొత్తం వ్యవహారం వైఎస్ఆర్ సీపీకి చెందింది. అయినా స్థానిక టీడీపీ నాయకులు తిరుమణ్యం ఎంపీటీసీ రవి, ఎస్బీఆర్‌పురం ఎంపీటీసీ కనకమ్మలను ప్రలోభపెట్టి క్యాంపు నిర్వహించారు. ఆలస్యంగా విషయం తెలుసుకొన్న స్థానిక వైఎస్ఆర్ సీపీ నేతలు చివరి నిమిషంలో ఎంపీడీఓ కార్యాలయానికి చేరుకొని ఇద్దరు ఎంపీటీసీలను తీసుకెళ్లడానికి ప్రయత్నించారు. యథావిధిగా పోలీసులు వైఎస్ఆర్ సీపీ నాయకులను అడ్డుకున్నారు. వెంటనే వారు సమావేశ మందిరంలోకి వెళ్లడం, సమావేశం నిర్వహించడం చకచకా జరిగిపోయాయి. మండలంలోని 7 ఎంపీటీసీ స్థానాలతో పాటు ఎంపీపీ స్థానాన్ని కైవసం చేసుకొన్న వైఎస్ఆర్ సీపీకి చెందిన ఈ మొత్తం వ్యవహారంలో టీడీపీ వారు ఎంపీపీతో పాటు ఇద్దరు ఎంపీటీసీలను తమవైపు తిప్పుకోవడంపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

డాక్టర్ పాల్‌రత్నం ఆదర్శమూర్తి

- 21 మందికి వినికిడి యంత్రాల పంపిణీ


వినికిడి యంత్రాలు అందుకున్న చిన్నారులు

విజయపురం: పీవీ ప్రైమరీ, హైస్కూల్ వ్యవస్థాపకుడు డాక్టర్ పాల్‌రత్నం ప్రతి ఒక్కరికి ఆదర్శమూర్తి అని సుప్రీంకోర్టు న్యాయవాది రాగా సందేశ్ అన్నారు. పన్నూరు పీవీ హైస్కూల్ ఆవరణంలో నెహ్రూ యువజన సేవా సంఘం ఆధ్వర్యంలో శనివారం జరిగిన పాల్‌రత్నం స్మారక జ్ఞాపక కూడిక జరిగింది. ఈ సందర్భంగా అన్నగారీ ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసి, వైద్యం అందించారు. అలాగే 21 మందికి వినికిడి యంత్రాలు ఉచితంగా అందజేశారు. అనంతరం న్యాయవాది శ్రేష్ఠ జోబెనో మాట్లాడుతూ పేద ప్రజలకు ఉచిత అందించాలన్న లక్ష్యంతో పీవీ స్కూల్ ఏర్పాటు చేశామన్నారు. ఈ పాఠశాల ద్వారా వేలాది మంది విద్యవంతులయ్యారని కొనియాడారు. తన తండ్రి స్థాపించిన సేవా కార్యాక్రమాలను నేటికీ కొనసాగిస్తానని ప్రేమ్ కుమార్ అన్నారు. ఈ కార్యక్రమంలో మమత, సుచిత్రా దేవి, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.